కథానిక

# నాగానందం

బసిరెడ్డి ఈశ్వరరెడ్డి

"రెడ్డిగారి గొడ్లపాకలో జన్మించాడు నాగన్న.

అతని తండ్రి గంగన్న తల్లి సీతమ్మ గొడ్లపాకలోని వ్యవసాయ పనిముట్ల కొట్టులోనే తరతరాల నుంచీ ఆ గొడ్లపాకలో నివసిస్తూ వాళ్ళ వంశీకులు రెడ్డిగారి కుటుంబాన్ని కొలిచారు. గంగన్న పరమవిధేయుడు. విధేయతకు కావ్యోత్ప్రేక్షలో హనుమంతునితో, వాడుక భాషలో శునకంతో పోల్చవచ్చును. రెడ్డిగారికి అతనిపై విశ్వాసం మెండు. గొడ్లశాలలోని పశువులను చూసుకోనడం పాలేర్లపై అజమాయిషీ చేయడం అతని డ్యూటీలు. అతడు రెడ్డిగారి వ్యావసాయిక మంత్రి. రెడ్డిగారి డిప్యూటీ గా సంక్రమించేఅసాధారణాధికారములన్నీ చెలాయించగలడు. రెడ్డిగారు పట్టణ విలాసాలకు దాసుడు. పట్నానికి వెళ్ళేసమయంలో "పొలం పనులూ గొడ్డూగోదా ఎలా చూసుకుంటావో, దానికేం (తన శ్రీమతికి) తెలీదు" అంటాడు గంగన్నతో. గంగన్న హర్షాతిరేకంతో తబ్బిబ్బై పోతాడు.

గంగన్నకు పెండ్లినాడు బంగారు కంటెను చేయించింది రెడ్డిగారే. రెడ్డిగారి భార్యే కదా సీతమ్మకు బంగారు కమ్మలు చేయించినది. ఇంత కంటే వాళ్ళ ఔదార్యమునకు మరేం నిదర్శనం కావాలి. ఇలా జీవితం మూడు పూవులూ ఆరు కాయలుగా సాగుతూంటే రెడ్డిగారి కుమార్తె పెండ్లి సమీపించింది. ఊరంతా వివాహ సంరంభం. ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయ్. రెడ్డిగ్గారి అల్లుడు పట్నంలో "ప్లీడరని" చెప్పుకుని అంతా మురిసిపోయారు. గంగన్న క్షణం తీరికలేకుండా శివమెత్తినట్లు యిటూ అటూ తిరుగుతున్నాడు. వివాహమంటపం పెద్ద లోగిలిని ఊడ్చి అలికి ముగ్గులు తీర్చమని ఆజ్ఞాపించారు సీతమ్మను. సీతమ్మ పచ్చి బాలింత. రోజంతా చన్నీళ్ళలో తడుస్తూ బండచాకిరీ చేయగా సాయంత్రానికి జ్వరం లంకించుకుంది. మర్నాడు ముహూర్తం. సీతమ్మ బాధను ఎవరూ గమనించలేదు. పెండ్లిమూడు రోజులూ వైభవంగా జరిగిపోయింది. అదను మించిన తరవాత తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చేర్చిన మరునాడే సీతమ్మ నవజాత శిశువుతో బాటు గతించింది. నాగన్నకప్పుడు నాలుగేండ్లు. గంగన్న తానే తల్లీ తండ్రీ ఐ "భూదేవిలాంటి" ఓర్పుతో బిడ్డను పోషించాడు.

కష్టాలు ఒకటి సంఖ్యలో రావు. ఒకరోజు రెడ్డిగారి భావితో గంగన్న తోలుతున్నాడు. విరిగింది. ఎడ్లతో బాటు కొట్టుకొని పోయిన గంగన్న భావిలో పడ్డాడు. తక్షణ మరణం తప్పనిసరి.

ఆసమయంలో తండ్రి మరణం నాగన్నకు అపారమైన అనుభవం కల్పించినది. కాయను వత్తి పండు చేసి నట్లయినది. తను గోము చేయడానికీ అల్లరి చేయడానికీ ఎవరూ లేరని తెలుసుకున్నాడు. ఇతరుల దయాదాక్షిణ్యాలే తన కాధారం. రెడ్డిగారి కొడుకును ఛాయలా అనుసరించాలి. అతడు నవ్వితే నవ్వాలి ఏడ్చితే ఏడ్వాలి. గుర్రం ఆటలో అతడు వీపుపై కూర్చొని అదలిస్తే మోకాళ్ళ బరువుతో పరిగెత్తాలి. చెవి మెలివేస్తే సహించాలి. బెల్లంముక్క యిస్తే మింగాలి. యివ్వకుంటే నోరు చప్పరించాలి. సంకటి పెడ్తే తినాలి. పెట్టకుంటే కడుపులో ఆకలిని అణచుకొని రావాలి. అతడు చేయవలసిన తొంభైతొమ్మిది పనులలోనూ రెడ్డి కుమారుని వెంట దస్త్రం మోసుకుని బడికి పోవడం కూడా ఒక్క పని. రెడ్డిగారి కుమారుడు రెండవతరగతిలో ఎప్పుడు చేరాడో చరిత్రపరిశోధకులు తేల్చవలసిన విషయం. దస్త్రం యింటికీ స్కూలుకూ మోస్తూనే ఎలా నేర్చుకున్నాడో నాగన్న రెండవ వాచకం ధారాళంగా చదవడం ప్రారంభించాడు. ప్రమాదం గ్రహించిన రెడ్డి దంపతులు నాగన్న తొంభైతొమ్మిదవ పనిని మాన్పించారు. నాగన్న చదువును నిరోధించగలిగారే గానీ, కుమారుడు రెండవతరగతి అనే సముద్రం

దాటునట్లు చేయలేక పోయారు. ఇలా కష్టాల్లో సుఖాల్లో నాగన్న పెరిగి పెద్దవాడైనాడు.

దృఢమై దీర్ఘములైన బాహువులూ మహా భుజములూ పీనవక్షమూ శిల్పంలో తీర్చిదిద్దబడినట్లున్న అవయవ సౌష్ఠవమూ—నాగన్నను గ్రీకు దేవతలతో పోల్చవచ్చును. ఇలాంటి నాగన్నను చూచి రెడ్డిగారి దాసి అంతటి స్థానంలో ఉన్న రామికూడా మోహించినదంటే ఆశ్చర్యంలేదు. నాగన్న అతిసాధువు. నోట్లో నాలికేలేదు. పాటుపడువాడు ఒకరి జోలికిపోడు. అతనిలో పెద్దలోటు సంగీతమంటే చెవి గోసుకుంటాడు.

ఒకరోజు వీధినాటకం ఉషా పరిణయం. నాగన్న వెళ్ళేసరికి బాణాసురుడు రంగస్థలంలోనికి వచ్చి కుర్చీ పట్టుకుని నిలబడ్డాడు. 'ఓరీ సేవకా మదీయ సింహాసనం బెచటరా' అన్నాడు. 'అదుగో స్వామీ' అన్నాడు సేవకుడు. దేవతలు ఇలా ఎందుకు నటిస్తారా అనుకున్నాడు నాగన్న. తన సందేహం ఇతరులకు చెబితే నవ్వుతారనుకున్నాడు. రాత్రంతా ఉషాకన్య విరహ వేదనలో గడిచింది. ఎప్పుడు నిద్రబోయాడో మాయదారి నిద్ర. నిద్ర లేచేసరికి సూర్యుడుదయించాడు. చేసిన తప్పు తెలుసుకొని గబగబా గొడ్లపాకవద్దకు పరుగెత్తాడు. గొడ్లపాకవద్ద జనం పోగైనారు. రెడ్డిగారు నాగన్నను చూడగానే ఉగ్రుడైనాడు. ఏంరా గాడిదకొడకా రాత్రెటెల్లావ్. పది గొర్రెలు పోయాయి అన్నాడు. నాకు తెలియదన్నాడు నాగన్న. నీకు తెలీకుండా యీ దొంగతనం జరగదన్నారు రెడ్డిగారు. రెడ్డిగారి భార్య తిట్లూ శాపనార్థాలూ ప్రారంభించింది. నాగన్న ప్రతివాదం చేశాడు. పాలేరు జవాబివ్వడమా? ఇది అపూర్వమైన విషయం. జవాబులద్వారా వచ్చిన క్రోధోద్రేకంతో రెడ్డిభార్య చీపురుకట్టతో కొట్టింది. నాగన్నను.

నాగన్న ఏకాకి ఐనాడు. దిక్కులేనివారికి దేవుడే దిక్కు. దేవుడనగా కరుణ ఉదారులైన జ్ఞాతులూ పెద్దలూ ఒక చిన్న పూరిల్లు నిర్మించారు. నాగన్నకు నాది అనడానికి యిల్లేర్పడింది. కూలీ నాలీ చేసుకుని జీవించడం ప్రారంభించాడు. విత్తనాలు చల్లడంలోనూ గట్టు చెక్కడంలోనూ అతడందెవేసిన చేయి. అతని నాగలిచాలు రేఖాగణితంలోని నిలువు గీతలకంటే ఖచ్చితంగా ఉంటుంది. కనుక అందరూ అతన్ని కూలికి పిలుస్తారు. పని ఎక్కువ ఉన్నప్పుడు రెండుశేర్లకుపైన కూలి దొరుకుతుంది. రోజూ ఒకసేరు గింజలకు తగ్గదు. తరచుగా యజమానులే సంకటి పెడ్తారు. పనిలేనప్పుడు వంటచెరుకులు తెస్తే అయ్యగారు కూరా నారా వేస్తారు. ఆ విధంగా చెమటోడ్చి శ్రమించి మిగిల్చిన గింజల నమ్మగా వచ్చిన డబ్బును అయ్యవారివద్ద దాచేవాడు. ఇంతలో వేరుసెనగ సీజను వచ్చినది. పాటకజనానికి యిదే ముఖ్యమైన తరుణం. నాగన్న తెల్లవారకముందే పొలమునకు వెళ్ళి పగలంతా "మంటినీ శరీరాన్ని ఏకంజేసి" వేరుసెనగలు తోడేవాడు. ఏ విధంగా కష్టించి నూరు రూపాయలు కూడ బెట్టాడు.

నూరు రూపాయలంటే సామాన్యమా? తను నూరురూపాయలకు యజమానుడు. ఈ విషయం తలచుకుంటే నాగన్నకు తృప్తి. తలచుకుంటే నూరు రూపాయలను మూడు నెలలలో ఖర్చుపెట్టవచ్చు. అలా ఖర్చుపెడితే తిరిగి కూలి చేయవలసిందే కదా. తను స్వతంత్రుడు కావాలి. రెండెడ్లను కొని ఐదెకరాల పొలం కౌలుకు తీసుకొని స్వతంత్రంగా వ్యవసాయం చేయించాలి. సన్నకారు రైతు ననిపించుకోవాలి. ఇలాంటి కల్పనలలో మునిగిపోయాడు నాగన్న. అప్పుడే అయ్యవారిని యీ విషయమై ప్రశ్నించాడు కూడా. పొలం కావాలంటే నీ వడిగిన చోట యిస్తాను. నీలాంటివానికే యివ్వనా అన్నాడు అయ్యవారు. కాస్త ఆలోచించుకొని, పొలం యిస్తానుగానీ ఖచ్చితంగా అర్థ ఫలసాయం నాకివ్వాలి. ఈమధ్య కౌలుదార్లు వేస్తున్నారే యీ వెధవవేషాలు నాకు సరిపోవన్నాడు ముందు జాగ్రత్తకోసం. నాగన్న అలాగే అన్నాడు.

నూరు రూపాయలలో జత ఎడ్లు కావాలి. అందులోనూ బాగా కష్టం చేయగలిగిన ఎద్దులు కావాలి. ఇది కొంచం దుస్తరమైన విషయమే. నాగన్న చుట్టూ పల్లెలలో వెతుకుతున్నాడు. యిలా వెతుకుతూ ఒకరోజున బుచ్చయ్య యింటికి వెళ్ళాడు. బుచ్చయ్య యిటీవలనే కూలీస్టేజినిదాటి సన్నకారు రైతైనాడు. దూరపు బంధువైన నాగన్నను అతడెంతో ఆదరించాడు. రెండు

మూడురోజులు నాగన్న అక్కడే ఉండడం తటస్థించినది. బుచ్చయ్య కూతురు లచ్చుము (లక్ష్మి). చెంపకు చేరడేసి కళ్ళు, పొడుగాటి వాల్జడా, ప్రసన్నవదనంలోని లక్ష్మి కళా, నిజంగా ఆ పిల్ల పాటకపుజనంలో పుట్టాల్సిందిగాదు. నాలుగు రోజులలోనే లక్ష్మి నాగన్నలకు అపూర్వమైన పరిచయమేర్పడ్డది. పరిచయం ప్రణయంగా మారింది.

నాగన్న తన అభిప్రాయమును మధ్యవర్తుల ద్వారా బుచ్చయ్యకు తెలియజేసాడు. బుచ్చయ్య కూలీవర్గానికి చెందనివాడు. కూలీవర్గంతో వియ్యమందడం అతనికి పరమరోత. ఖాళీజవాబుతో నిరాశోపహతుడై నాగన్న స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. కాని లక్ష్మి తన ప్రతిజ్ఞను దాటనన్నది. నాగన్నకు లేకుండా యితరులచ్చి పెండ్లిచేస్తే భావిలోపడి ఛస్తానన్నది. పాటకపు జనమునకున్న ధైర్యమూ మనోస్థయిరమూ దర్జీ నిర్మితులైన సభ్యులకుండదు. చివరకు లక్ష్మిని నాగన్న కిచ్చి పెండ్లి చేయుటకు నిశ్చయింపబడినది. వోలికి (వధూకట్నము) గాను నాగన్న బుచ్చయ్యకు ముప్పైరూపాయలూ ఒక బస్తా బియ్యం యిచ్చునట్లు పెద్దలు నిశ్చయించారు. పాపం మధ్యతరగతి కుటుంబాలతో వియ్యమందాలనే బుచ్చయ్యమధుర స్వప్నం భగ్నమైంది.

పెండ్లి ముగిసింది. బంధువులు తిని త్రాగి సంతృప్తితో యిళ్లకు వెళ్ళారు. పెండ్లిఖర్చు యనభైరూపాయలు. వోలికి యాభైరూపాయలు యితర ఖర్చులు ముప్పైరూపాయలు. మొత్తం నూటఅరవైరూపాయలు. సంపాదన పోగా బడేసాయిబువద్ద అరవైరూపాయలు బాకీ చేయవలసి వచ్చినది. బడేసాయిబుకు చిల్లర దుకాణంకలదు. వడ్డీవ్యాపారము కూడా చేస్తాడు. జమాఖాతాలను తారుమారు చేయడంలో అతడు సిద్ధహస్తుడు. ఒకటికి రెండు రాస్తాడు వడ్డికి వడ్డీ, చక్రవడ్డీకి చక్రవడ్డీ లెక్క గడతాడు జమాఖర్చులలో తారుమారైందని ఎవరైనా సందేహిస్తే బడేసాయిబు లెక్కలను తప్పనే ధైర్యం ఎవరికుందో రమ్మని సవాలు చేస్తాడు. నాగన్న తీసుకున్నది యాభైరూపాయల షరుకులు. ఖాతాలోని కెక్కినది అరవైరూపాయలు. నెలకువడ్డీ మూడు రూపాయలు. నాగన్న రెండేడ్లు గడిచినా వడ్డీకూడా చెల్లించలేకపోయాడు. బడేసాయిబు ప్రతి సంవత్సరమూ అసలూ వడ్డీకివడ్డీకలిపిపత్రం తిరగరాయించుకుంటున్నాడు.

నాల్గయిదేండ్లు గడిచినవి. నాగన్న అనేక మంది కూలీలను పోగుచేసి అనేకమైన పీస్‌వర్కులు చేశాడు కూలీ జట్టుకు నాయకుడై గట్లు ఎగపోత పనిలో కరువు రోడ్ల నిర్మాణంలో ప్రాజెక్టు పనుల్లోకూడా పాల్గొన్నాడు. ముందుకంటే ఆదాయం ఎక్కువైనా ఏమీ మిగలడంలేదు. మిగిలినది బడేసాయిబు వడ్డీకి సరిపోతున్నది. ఈలోగా లక్ష్మికి నలుగురు బిడ్డలు కలిగారు. ఆమె అసలే ఓర్పులేని మనిషి ఇంటి చాకిరీకూడా సరిగా చేసుకోనలేదు. కాయకష్టంలో మగనికి ఏమాత్రం సాయం చేయలేదు. యిటీవల చుట్టాల రాకపోకలు ఎక్కువైనవి. మామగారు బుచ్చయ్య గారు వస్తాడు. వస్తూవస్తూ మామ తన గౌరవాన్ని రైతు ననే దర్జానూ మోసుకుని వస్తాడు. అతనికి సీసా సారా కావాలి. వరి అన్నమే పెట్టాలి బడేసాయిబు బాకీనే తీర్చలేదు. ఎడ్లనెలా కొంటాడు. రెడ్డిగారి కుమారుడు తనవద్ద పెద పాలేరుగా ఉండమన్నాడు. ఆ స్వతంత్ర జీవనం యిదివరకనుభవించినది చాలనుకున్నాడు నాగన్న. విధిలేక మోతుబరి రైతులవద్దకువెళ్ళి ఎడ్లను కొనడానికి అప్పివ్వమని ప్రార్థించాడు. ఏ ఆధారంతో నీ కప్పిచ్చేది? నీకు భూమీ బుట్రా లేదాయె నీ పూరిల్లు కాసుచేయదన్నారు మోతుబరులు. నా చర్మం చెప్పులు కుట్టించైనా మీ ఋణం తీర్చుకుంటానన్నాడు నాగన్న. అప్పుకు వచ్చే వాళ్ళంతా మొదట యిలాగే అడుక్కుంటారు. తీరా యిచ్చిన తరువాత మీలాంటి అలగాజనంతో వసూలు చేయడానికి బ్రహ్మదేవుడే దిగిరావాలి. అని యీసడించారు మోతుబరులు. మానసికంగా నాగన్న జవసత్వాలుడిగినవి. చివరి ప్రయత్నంగా అయ్యవారినే అప్పివ్వమని ప్రార్థించాడు. చేతకాలేదొక చిల్లిగవ్వ యని, సాహిత్యంలో జవాబిచ్చాడు అయ్యవారు. రోజులు గడిచిపోతున్నవి. స్వంతసేద్యంచేస్తూ సన్నకారు రైతు ననిపించుకోవాలనే నాగన్న మహాతా కాంక్ష యీడేరున దెన్నడో మరి.

★